ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్ Evening 6PM

GV MALL shop & celebrate TELANGANA | ANDHRAPRADESH | KARNATAKA

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 77 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 3 +https:www.prajarepublic.com + వెల - 1/- | శనివారం 19 అక్టోబర్ 2024

RNI No: APTEL/2023/87888 | Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole

# విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తాం: ఏపీ సీఎం చంద్రబాబు

## అమరావతిలో రాజధాని నిర్మాణ పనులను సీఎం చంద్రబాబు పునఃప్రారంభించారు.

## సీఆర్డీఏ ఆఫీసు పనులను ప్రారంభించి. ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు.



**అమరావతి, అక్టోబర్ 19 (రిపబ్లిక్ న్యూస్) :** అమరావతిలో రాజధాని నిర్మాణ పనులను సీఎం చంద్రబాబు పునఃప్రారంభించారు. సీఆర్డీఏ ఆఫీసు పనులను ప్రారంభించి ఈ కార్యక్రమాన్ని మొదలుపెట్టారు. తుళ్లూరు మండలం ఉద్దండరాయుని పాలెం వద్ద పనులు ప్రారంభించారు. భవన ప్రాంగణంలో సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ పూజా కార్యక్రమం నిర్వహించారు. రూ.160 కోట్లతో గతంలో తెదేపా హయాంలో ఏడంతస్తుల్లో సీఆర్డీఏ కార్యాలయ పనులు చేపట్టారు. ప్రాజెక్టు కార్యాలయ నిర్మాణాన్ని 2017లో ప్రారంభించారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పనులను నిలిపేశారు. మొత్తం 3.62 ఎకరాల్లో జీ ప్లస్ 7 భవనాన్ని ఇక్కడ ప్రభుత్వం నిర్మిస్తోంది. అదనంగా పార్కింగ్, ల్యాండ్ స్కేపింగ్కు 2.51 ఎకరాల విస్తీర్ణం కేటాయించారు. ఆర్కిటెక్చరల్ ఫినిషింగ్స్, ఇంటీరియర్స్, ఎలక్ట్రిక్ పనులు పెండింగ్లో ఉన్నాయి.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చంద్రబాబు మాట్లాడారు. “చరిత్రను తిరగరాసేందుకు మనమంతా ఇక్కడ సమావేశమయ్యాం. రాష్ట్ర విభజన సమయంలో అనేక ఇబ్బందులు పడ్డాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో సైబరాబాద్ నగరాన్ని తీర్చిదిద్దిన ఘనత మాదే. ముందుచూపుతో ఆనాడే సైబరాబాద్లో 8 వరుసల రోడ్లు వేశాం. శంషాబాద్ విమానాశ్రయానికి 5 వేల ఎకరాలు ఎందుకని అందరూ ప్రశ్నించారు. అభివృద్ధికి అడ్డుపడే వారు ప్రతిచోటా ఉంటారు. అమరావతి రైతులను ఒప్పించి భూమి సేకరించాం. రాజధాని, సమాజ హితం కోసం మీరంతా భూములు ఇచ్చారు. అమరావతి కోసం 54 వేల ఎకరాలు సేకరించాం. మహిళా రైతులు వైకాపా ప్రభుత్వంపై గట్టిగా పోరాడారు”“రాష్ట్రానికి మధ్యలో ఉండే ప్రాంతం.. అమరావతి. ఒక రాష్ట్రం, ఒక రాజధాని అని.. ప్రతిచోటా చెప్పాను. విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తాం. కర్నూలులో హైకోర్టు బెంచ్, పరిశ్రమలను ఏర్పాటు చేస్తాం” అని చంద్రబాబు వెల్లడించారు.

# మరో 3 విమానాలకు బాంబు బెదిరింపులు..



## గడిచిన 24 గంటల్లో 3 విమాన సర్వీసులకు బాంబు బెదిరింపులు రావడం మళ్లీ కలకలం రేపింది.

**అక్టోబర్ 19 (రిపబ్లిక్ న్యూస్) :** గడిచిన 24 గంటల్లో 3 విమాన సర్వీసులకు బాంబు బెదిరింపులు రావడం మళ్లీ కలకలం రేపింది.దేశంలో వరుసగా విమానాలకు వస్తున్న బాంబు బెదిరింపులు ప్రయాణికులతో పాటు అధికారులను ఆందోళనకు గురుచేస్తున్నాయి. తాజాగా గడిచిన 24 గంటల్లో మరో మూడు విమానాలకు బాంబు బెదిరింపులు రావడం గమనార్హం.ఎయిర్ ఇండియా ఎక్స్ప్రెస్ విమానం 189 మంది ప్రయాణికులతో దుబాయ్ నుంచి జైపురు బయలుదేరింది. ఈ క్రమంలో ఆ విమానానికి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. అప్రమత్తమైన అధికారులు వెంటనే విమానాన్ని జైపుర్లో సురక్షితంగా ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. విమానాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయగా ఎటువంటి అనుమానస్పద వస్తువులు లభించలేదని అధికారులు తెలిపారు.మరోవైపు బెంగళూరు నుంచి ముంబయికి వెళ్లేందుకు టేకాఫ్కు సిద్ధమైన ఆకాశ ఎయిర్లైన్స్ (1366) విమానానికి బాంబు బెదిరింపులు వచ్చాయి. అప్రమత్తమైన అధికారులు ప్రయాణికులను విమానం నుంచి దింపి క్షుణ్ణంగా పరిశీలించారు. తర్వాత అది నకిలీ బెదిరింపుగా తేలింది. అటు దిల్లీ నుంచి లండన్కు వెళ్తున్న విస్తారా (17) విమానానికి సైతం ఈ తరహా బెదిరింపు వచ్చింది. అప్రమత్తమైన అధికారులు వెంటనే ఆ విమానాన్ని జర్మనీలోని ఫ్రాంక్ఫర్ట్కు మళ్లించారు.గడిచిన వారం రోజుల్లో దాదాపు 30కి పైగా విమానాలకు ఇంటువంటి బాంబు బెదిరింపులు రావడం తీవ్ర ఆందోళన కలిగించే అంశం. ఈ వరుస బాంబు బెదిరింపులను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించింది. ఈ బెదిరింపులను నియంత్రించేందుకు కఠిన చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతోంది. అందులో భాగంగా బాంబు బెదిరింపులకు పాల్పడే వ్యక్తులపై నిషేధం విధించే అవకాశం ఉందని పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఇటీవల తెలిపారు. అదేవిధంగా ఇప్పటికే ఉన్న నిబంధనల్లో మార్పులు చేయాల్సి ఉందన్నారు.

# పన్ను హత్యకు కుట్రకేసు.. రా మాజీ అధికారిని అరెస్టు చేసిన దిల్లీ పోలీసులు..!

## పన్నూ హత్యకు కుట్ర కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న భారత మాజీ ఇంటెలిజెన్స్ అధికారి వికాస్ యాదవ్ అరెస్టయినట్లు తెలుస్తోంది..



**దిల్లీ, అక్టోబర్ 19 (రిపబ్లిక్ న్యూస్) :** సిక్కు వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూహత్యకు కుట్ర జరిగిందన్న ఆరోపణలపై అమెరికా దర్యాప్తు జరుపుతున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా భారత మాజీ ఇంటెలిజెన్స్ అధికారి వికాస్ యాదవ్పై ఇటీవల అభియోగాలు నమోదవ్వడం చర్చనీయాంశమైంది. వికాస్ పరారీలో ఉన్నట్లు అమెరికా దర్యాప్తు సంస్థ ఎఫ్బీఐ నోటీసులు జారీ చేసింది. ఈ తరుణంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ అధికారిని తాజాగా దిల్లీ పోలీసులు అరెస్టు చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు జాతీయ మీడియాల్లో కథనాలు వచ్చాయి.ఈ కుట్ర కేసుకు సంబంధించి న్యూయార్క్లోని కోర్టులో న్యాయశాఖ ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. అందులో భారత పౌరుడైన వికాస్యాదవ్ (39)పై మనీలాండరింగ్, కుట్రకు వ్యక్తులను నియమించడం, పన్నూ హత్యకు ప్రణాళిక రచించడం వంటి అభియోగాలు మోపారు. ప్రస్తుతం ఆయన ఆచూకీ తెలియరావడం లేదని అందులో పేర్కొన్నారు. వికాస్ గతంలో భారత ప్రభుత్వ అధికారిగా విధులు నిర్వహించారు. భారత విదేశీ ఇంటిలెజెన్స్ విభాగం, రా విభాగాన్ని నిర్వహించే కేబినెట్ సెక్రటేరియట్ ఉద్యోగిగా పనిచేశారు.అమెరికా గడ్డపై పన్నూ హత్యకు కుట్ర జరిగిందని, దాన్ని తాము భగ్నం చేశామని అగ్రరాజ్యం గతేడాది ఆరోపించిన సంగతి తెలిసిందే. భారత ప్రభుత్వ ఉద్యోగితో కలిసి పన్నూను హత్య చేసేందుకు నిఖిల్ గుప్తా కుట్ర పన్నారని అమెరికా ప్రాసిక్యూటర్లు ఆరోపించారు. ఇప్పటికే చెక్ రిపబ్లిక్ జైలులో ఉన్న నిఖిల్ను అమెరికాకు అప్పగించినట్లు ఆ మధ్య మీడియా కథనాలు వెల్లడించాయి. అటు ఈ కేసు వ్యవహారంపై అమెరికా కోర్టు భారత ప్రభుత్వానికి సమన్లు కూడా జారీ చేసింది.అయితే, ఈ ఆరోపణలను తీవ్రంగా ఖండించిన భారత్.. దీనిపై విచారణ జరిపేందుకు స్వదేశంలో ఓ దర్యాప్తు కమిటీని ఏర్పాటుచేసింది. ఈ క్రమంలోనే ఇటీవల భారత అధికారుల బృందం అమెరికాలోని విదేశాంగ శాఖ, న్యాయశాఖ అధికారులతో సమావేశమైంది. ఈ అభియోగాల్లో పేర్కొన్న భారత అధికారి ప్రస్తుతం ప్రభుత్వంలో పనిచేయడం లేదని న్యూదిల్లీ తమకు వెల్లడించినట్లు అమెరికా విదేశాంగ శాఖ మంత్రి మాథ్యూ మిల్లర్ తెలిపారు. ఈ బృందం పర్యటన ముగిసిన తర్వాతే వికాస్ యాదవ్పై అగ్రరాజ్యం అభియోగాలు చేయడం గమనార్హం.

# కేసీఆర్ కుటుంబానిది దోపిడీ చరిత్ర: రేవంత్రెడ్డి

## నాలాలు, చెరువులను ఆక్రమించుకున్న వారే హైడ్రాను చూసి భయపడుతున్నారని తెలంగాణ సీఎం రేవంత్రెడ్డి అన్నారు.



**హైదరాబాద్, అక్టోబర్ 19 (రిపబ్లిక్ న్యూస్):** నాలాలు, చెరువులను ఆక్రమించుకున్న వారే హైడ్రాను చూసి భయపడుతున్నారని తెలంగాణ సీఎం రేవంత్రెడ్డి అన్నారు. చార్మినార్ వద్ద నిర్వహించిన రాజీవ్గాంధీ సద్భావనా యాత్ర స్మారక దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. “హైడ్రాను చూపి రియల్ ఎస్టేట్ను దెబ్బతీయాలని కొంతమంది చూస్తున్నారు. అజీజ్నగర్లో హరీశ్రావుకు ఫాంహౌస్ లేదా? గతంలో కాంగ్రెస్ వల్లనే హరీశ్ రావుకు మంత్రి పదవి వచ్చింది. కేసీఆర్ కుటుంబానికి దోపిడీ చరిత్ర ఉంది. తెలంగాణ ఆర్థిక మూలాలు దెబ్బతీయాలని చూస్తున్నారు “ అని రేవంత్రెడ్డి విమర్శించారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి గీతారెడ్డికి సద్భావనా అవార్డును సీఎం ప్రదానం చేశారు. గీతారెడ్డికి ఈ అవార్డు రావడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు.”దేశ సమగ్రత కోసం 34 ఏళ్ల క్రితం రాజీవ్ గాంధీ సద్భావన యాత్ర చేపట్టారు. ఏటా వారి స్ఫూర్తిని కొనసాగిస్తూ ముందుకు వెళ్తున్నాం. సుదీర్ఘ కాలం ప్రజలకు సేవలందించిన గీతారెడ్డిని సద్భావన అవార్డుకు ఎంపిక చేయడం అభినందనీయం. రాజకీయాల్లో పదవుల కోసం పాకులాడే వారిని చూశాం. కానీ 2023 ఎన్నికల్లో పోటీ చేయనని చెప్పిన గొప్ప వ్యక్తి గీతారెడ్డి. గాంధీ కుటుంబం తీసుకున్న నిర్ణయాలతోనే కాంగ్రెస్ హయాంలో దేశంలో పేదలకు మేలు జరిగింది.ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ దేశం కోసం ప్రాణాలు అర్పించారు. ప్రధాని పదవులను త్యాగం చేసిన ఘనత సోనియా, రాహులే.రియల్ ఎస్టేట్ సంస్థలు భయపడొద్దు... వారికి నేను హామీ ఇస్తున్నా. మా ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది. హైడ్రా ఆగదు.. అక్రమార్కులకు కంటి మీద కునుకు ఉండదు. హైడ్రా అనగానే హరీశ్రావు, కేటీఆర్ బయటకు వస్తున్నారు. పేదలకు మేలు జరిగితే చూసి ఓర్వలేకపోతున్నారు. మూసీలో మగ్గిపోతున్న వారికి ఇళ్లు ఇచ్చి, వ్యాపారాలు చేసుకునేందుకు మహిళలకు ఆర్థిక సాయం అందించాం. మేం వారిని గుండెల్లో పెట్టుకుంటుంటే భారాస నేతలు గుండెలు బాదుకుంటున్నారు. హరీశ్రావు, కేటీఆర్ ఫామ్ హౌస్ల విషయంపై అఖిలపక్షాన్ని పిలుద్దాం. నిజ నిర్ధారణ కమిటీతో నిజాలు నిగ్గు తేల్చుదాం. ఆ తరువాత మూసీ దగ్గరకా.. ఇంకెక్కడికైనా వెళదాం.” అని రేవంత్రెడ్డి తెలిపారు.

# ప్రతి నియోజకవర్గానికి 3,500 నుంచి 4 వేల ఇందిరమ్మ ఇళ్లు: మంత్రి పొంగులేటి

## ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక ప్రకటన చేశారు.



**హైదరాబాద్, అక్టోబర్ 19 (రిపబ్లిక్ న్యూస్) :** ఇందిరమ్మ ఇళ్లపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక ప్రకటన చేశారు. ఈ నెలాఖరులోగా మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 నుంచి 4,000 గృహాలు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. రానున్న నాలుగేళ్లలో 20 లక్షల ఇందిరమ్మ ఇళ్లు నిర్మించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. పార్టీలకు సంబంధం లేకుండా పేదలకు అందజేస్తామని తెలిపారు.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# విశాఖలో ముగిసిన నారా లోకేశ్ పర్యటన

నగరంలో మంత్రి నారా లోకేశ్ పర్యటన ముగిసింది. ఇక్కడి తెదేపా కార్యాలయంలో కార్యకర్తలను ఆయన కలిశారు.



విశాఖ, అక్టోబర్ 19 (రిపబ్లిక్ న్యూస్) : గరంలో మంత్రి నారా లోకేశ్ పర్యటన ముగిసింది. ఇక్కడి తెదేపా కార్యాలయంలో కార్యకర్తలను ఆయన కలిశారు. అనంతరం విమానాశ్రయానికి బయలుదేరారు. విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి లోకేశ్ విజయవాడకు వెళ్లనున్నారు. సాక్షిపై పరువు నష్టం దావా కేసులో ఆయన శుక్రవారం విశాఖలో కోర్టుకు హాజరైన సంగతి తెలిసిందే. ఈ కేసును నవంబర్ 15కి న్యాయమూర్తి వాయిదా వేశారు

# వృద్ధ దంపతుల దారుణ హత్య.. నిందితుల అరెస్టు

## కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జంట హత్యల కేసును రాచకొండ పోలీసులు ఛేదించారు.

హైదరాబాద్,అక్టోబర్ 19 (రిపబ్లిక్ న్యూస్) : కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో జంట హత్యల కేసును రాచకొండ పోలీసులు ఛేదించారు. మంగళవారం రాత్రి మామిడి తోటలో వృద్ధ దంపతులను దుండగులు దారుణంగా హత్య చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను మీడియా సమావేశంలో రాచకొండ సీపీ సుధీర్ బాబు వెల్లడించనున్నారు.పొట్ట కూటి కోసం వచ్చి.. వ్యవసాయ క్షేత్రంలో కాపలాదారులుగా పని చేస్తూ అక్కడే ఆవాసం ఉంటున్న వృద్ధ దంపతులను దుండగులు దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా కందుకూరు ఠాణా పరిధిలోని కొత్తగూడలో మంగళవారం రాత్రి చోటుచేసుకోగా బుధవారం వెలుగుజూసింది. సీఐ సీతారాం తెలిపిన వివరాల ప్రకారం.. నాగర్కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం ముష్టిపల్లికి చెందిన మూగ (చింతబాయి) ఉషయ్య (70), అతడి భార్య శాంతమ్మ(60) కొత్తగూడ సమీపంలో వారి స్వగ్రామానికి చెందిన యజమాని మనోహర్రావుకు చెందిన వ్యవసాయ క్షేత్రంలో



రెండున్నరేళ్లుగా కాపలాదారులుగా పనిచేస్తున్నారు. మామిడి తోటలో ఓ పక్కన షెడ్లతోపాటు నిర్మించిన గదుల్లో నివాసం ఉంటున్నారు. వీరిని మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నరికి చంపారు. శాంతమ్మను ఇంట్లోనే మంచంపై గొంతు కోసి హత్య చేశారు. ఉషయ్యను వారు నివాసం ఉంటున్న వంద మీటర్ల దూరంలో మామిడి తోటతో పరుగెత్తించి మెడభాగంపై నరికి చంపారు.

# రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా డబుల్ ఇంజిన్ సర్కారు కృషి: లంకా దినకర్

## గత ఐదేళ్లలో వైకాపా హయాంలో కేంద్ర నిధులు పక్కదారి పట్టించారని భాజపా నేత లంకా దినకర్ విమర్శించారు.

విజయవాడ,అక్టోబర్ 19 (రిపబ్లిక్ న్యూస్) : గత ఐదేళ్లలో వైకాపా హయాంలో కేంద్ర నిధులు పక్కదారి పట్టించారని భాజపా నేతలంకా దినకర్ విమర్శించారు. 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. స్వర్ణాంధ్ర సాధనకు అందరం కలిసి కృషి చేస్తామన్నారు. 20 సూత్రాలు అందరికీ తెలిసేలా అన్ని కలెక్టరేట్ల వద్ద ఉంచుతామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రకాలుగా రాష్ట్రానికి సహకారం అందిస్తోందని పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు వెంట తామంతా నడుస్తామని చెప్పారు. అర్హులైన అందరికీ పథకాలు అందించేందుకు సీఎం కృషి చేస్తున్నారని



వివరించారు. రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా డబుల్ ఇంజిన్ సర్కారు పనిచేస్తోందని లంకా దినకర్ తెలిపారు.

# అశోక్ నగర్ చౌరస్తాకు బండిసంజయ్.. అదుపులోకి తీసుకున్న పోలీసులు

కేంద్ర మంత్రి బండి సంజయ్ హైదరాబాద్ లోని అశోక్ నగర్ చౌరస్తాకు వెళ్లారు. కేంద్ర మంత్రి రాకతో భారీగా అక్కడికి గ్రూప్–1 అభ్యర్థులు తరలివచ్చారు.



హైదరాబాద్,అక్టోబర్ 19 (రిపబ్లిక్ న్యూస్): కేంద్ర మంత్రి బండి సంజయ్ హైదరాబాద్లోని అశోక్ నగర్ చౌరస్తాకు వెళ్లారు. కేంద్రమంత్రి రాకతో భారీగా అక్కడికి గ్రూప్-1 అభ్యర్థులు తరలివచ్చారు. వారిని పరామర్శించి.. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం చలో సచివాలయానికి పిలుపునిచ్చారు. గ్రూప్-1 అభ్యర్థులతో కలిసి సచివాలయం వైపు ర్యాలీగా బయలుదేరారు. దీంతో ఈ ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసుల తీరుపై బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎంను కలిసి వాస్తవాలు వివరించేందుకు వెళ్తున్నామని చెప్పారు. సచివాలయానికి వెళ్లి తీరుతామని స్పష్టం చేశారు. దీంతో పోలీసులు బండి సంజయ్ను అదుపులోకి తీసుకున్నారు.గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల వాయిదా, జీవో 29ని రద్దు చేయాలని కోరుతూ.. ప్రిలిమ్స్ ఉత్తీర్ణులు సహా వారికి మద్దతుగా నిరుద్యోగ అభ్యర్థులు హైదరాబాద్లో గత కొన్ని రోజులుగా నిరసనలు చేస్తున్నారు. ఈ క్రమంలో అశోక్నగర్, గాంధీనగర్లోని వీధులన్నీ విద్యార్థులు, పోలీసులతో కిక్కిరిసిపోయాయి.

# సాఫ్ట్వేర్ ఉద్యోగాల పేరుతో రూ.26 లక్షలకు కుచ్చుటోపీ

## నగరంలో సాఫ్ట్వేర్ ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేస్తున్న భార్యభర్తలపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు.

హైదరాబాద్ ,అక్టోబర్ 19 (రిపబ్లిక్ న్యూస్) : నగరంలో సాఫ్ట్వేర్ ఉద్యోగాల పేరుతో యువతను మోసం చేస్తున్న భార్యభర్తలపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ వీరు పలువురి వద్ద దాదాపు రూ.26 లక్షలు వసూలు చేశారు. ఆ తర్వాత ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో మోసపోయినట్లు తెలుసుకున్న బాధితులు పోలీసులను ఆశ్రయించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీహిల్స్ స్రవంతినగర్లో నివసించే వాసు టీసీఎస్లో ఉద్యోగి. ఆయనకు అదే సంస్థలో పనిచేసే చల్ల శ్రీరాంకిరణ్ పరిచయమయ్యాడు. తనకు వివిధ సాఫ్ట్వేర్ సంస్థలతో పరిచయాలున్నాయని, ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ వాసుకు చెప్పాడు. ఇది నమ్మిన వాసు తనకు తెలిసిన 17 మందిని అతడి వద్దకు తీసుకెళ్లాడు. ఐబీఎం సంస్థలో ఉద్యోగాల కోసం వీరు శ్రీరాంకిరణ్, అతడి భార్య సంధ్యారాణి ఖాతాల్లోకి ఫిబ్రవరిలో రూ.26 లక్షలు పంపించారు. అనంతరం 17 మందికి ఉద్యోగాలు వచ్చినట్లు ఆఫర్ లెటర్లు ఇచ్చారు. దీంతో ఉద్యోగంలో చేరడానికి అభ్యర్థులు వెళ్లగా అవి నకిలీ పత్రాలని తేలింది. దీనిపై వాసు ప్రశ్నించగా వారికి మరో సంస్థలో ఉద్యోగాలిప్పిస్తానని నమ్మించాడు. అనంతరం భార్యభర్తలు సెల్ఫోన్లో అందుబాటులో లేకుండా పోయారు. ఈ మోసంపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దంపతులపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.



# వైకాపా నేత ఎంవీవీ సత్యనారాయణ ఇల్లు, కార్యాలయాల్లో ఈడీ సోదాలు

## వైకాపా నేత, మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఇల్లు, కార్యాలయాల్లో ఈడీ సోదాలు చేపట్టింది.

విశాఖ, అక్టోబర్ 19 (రిపబ్లిక్ న్యూస్) : వైకాపా నేత, మాజీ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ ఇల్లు, కార్యాలయాల్లో ఈడీ సోదాలుచేపట్టింది. లాసన్స్ బే కాలనీలోని ఇల్లు, కార్యాలయంలో అధికారులు తనిఖీలు చేస్తున్నారు.మధురవాడలోని ఎంవీవీ సిటీ కార్యాలయంలోనూ సోదాలు సాగుతున్నాయి.



# పోలీసు డిపార్ట్మెంట్ స్థలం కబ్జా.. ఐదుగురిపై కేసు

చార్మినార్ పోలీసు స్టేషన్ పరిధిలో ఇటీవల పోలీసు డిపార్ట్మెంట్కు చెందిన స్థలం కబ్జాకు గురైంది.

హైదరాబాద్,అక్టోబర్ 19 (రిపబ్లిక్ న్యూస్) : చార్మినార్ పోలీసు స్టేషన్ పరిధిలో ఇటీవల పోలీసు డిపార్ట్మెంట్కు చెందిన స్థలం కబ్జాకు గురైంది. ఈక్రమంలో కబ్జాకు పాల్పడిన పలువురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఐదుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సుమారు 200 గజాల స్థలం ఆక్రమణకు గురైనట్లు గుర్తించారు.




# మూసీ పక్కన మూడేళ్లు ఉండేందుకు సిద్ధమే : కేటీఆర్

సీఎం రేవంత్ రెడ్డి తన పదవిని కాపాడుకునేందుకు పేదల కడుపు కొట్టి దిల్లీకి మూటలు మోస్తున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ధ్వజమెత్తారు.



హైదరాబాద్,అక్టోబర్ 19 (రిపబ్లిక్ న్యూస్) : సీఎం రేవంత్ రెడ్డి తన పదవిని కాపాడుకునేందుకు పేదల కడుపు కొట్టి దిల్లీకి మూటలు మోస్తున్నారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ధ్వజమెత్తారు. రేవంత్రెడ్డి ప్రభుత్వం చేస్తోంది మూసీ బ్యూటిఫికేషన్ కాదని, లూటిఫికేషన్ అని ఆరోపించారు. నాగోల్లోని మురుగు శుద్ధి కేంద్రాన్ని (ఎస్టీపీల) మాజీ మంత్రులు, జీహెచ్ఎంసీ పరిధిలోని ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి ఆయన పరిశీలించారు. రూ.386 కోట్లతో కేసీఆర్ ప్రభుత్వం 31 ఎస్టీపీలను నిర్మించేందుకు సిద్ధమైందని గుర్తు చేశారు. వారసత్వ సంపదలను కాపాడుతూనే అభివృద్ధి చేయవలసిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుందని స్పష్టం చేశారు. రూ.545 కోట్లతో 15 బ్రిడ్జిలు నిర్మించిన ఘనత కేసీఆర్కు దక్కిందన్నారు. మూసీ నిర్వాసితులకు ఇస్తున్న ఇళ్లు కూడా కేసీఆర్ నిర్మించిన రెండు పడక గదులేనని తెలిపారు.ఇటీవల తనను మూసీ పక్కన మూడు నెలలు ఉండాలని రేవంత్ చేసిన సవాల్పై స్పందించిన కేటీఆర్.. మూడేళ్ల పాటు ఉండేందుకు సిద్ధమేనన్నారు. దమ్ముంటే మూసీ నదీ లోతు పెంచి, బలమైన కోల్కతా లాంటి నగర నిర్మాణం చేయాలని సూచించారు. సరైన డీపీఆర్ లేకుండా ముందుకెళ్లడం మూర్ఖత్వం అవుతుందని హితవు పలికారు. మూసీ బాధితులకు భారాస అండగా ఉంటుందని, వారి తరఫున న్యాయపోరాటం చేస్తుందన్నారు.

# బాగుందని ట్వీట్స్ వస్తే.. సినిమా సూపర్ హిట్టే: నాగవంశీ

సినిమా రివ్యూలపై నిర్మాత నాగవంశీ కీలక వ్యాఖ్యలు చేశారు. కొవిడ్ తర్వాత ప్రేక్షకుల ఆలోచనా విధానం మారిందన్నారు.



సినిమా రివ్యూలపై తన అభిప్రాయాన్ని తెలియజేశారు నిర్మాత నాగవంశీ . తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన సినిమా రివ్యూలు, కొత్త సినిమా విశేషాలు పంచుకున్నారు. కొవిడ్ తర్వాత ప్రేక్షకుల ఆలోచనా విధానం ఎంతో మారిందన్నారు. పోస్టర్ లేదా టీజర్ విడుదల కాగానే.. ఆ సినిమా చూడాలా? వద్దా? అనే ఆలోచనకు వచ్చేస్తున్నారని చెప్పారు. రివ్యూలతో సంబంధం లేకుండా తాము చూడాలనుకున్న సినిమా చూస్తున్నారని తెలిపారు.”ఒక సినిమాకు సంబంధించి రివ్యూలకంటే కూడా రెవెన్యూకే ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తాం. ఏదైనా సినిమా విడుదలైనప్పుడు సోషల్మీడియా వేదికగా కొంతమంది దానిపై రివ్యూలు ఇస్తుంటారు. తమ అభిప్రాయాన్ని తెలియజేస్తుంటారు. అది వాళ్ల ఇష్టం. దాని మీద రియాక్ట్ కావాల్సిన అవసరం ఏముంది? సినిమా నచ్చితే ప్రేక్షకులు తప్పకుండా చూస్తారు. నచ్చకపోతే చూడరు. సోషల్మీడియాలో మీరు పెట్టే రివ్యూ వీడియోలు చూసి ఇన్ఫ్లూయెన్స్ అవుతారని భావిస్తే అది తప్పే. మరో విషయం ఏమిటంటే.. వెబ్సైట్స్, యూట్యూబ్ వంటివి పక్కన పెడితే ఇప్పుడున్న రోజుల్లో ట్విటర్ రివ్యూలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆ ప్లాట్ఫామ్ వేదికగా ఒక సినిమా గురించి పది పోస్టులు వేస్తే.. అందులో ఐదు బాగుందని ఉంటే చాలు.. సినిమా సూపర్ హిట్టే” అని నాగవంశీ చెప్పారు.నాగవంశీ ప్రస్తుతం ‘లక్కీ భాస్కర్ రిలీజ్ పనుల్లో బిజీగా ఉన్నారు. దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నటించారు. మీనాక్షి చౌదరి కథానాయిక. వెంకీ అట్లూరి దర్శకుడు. 1980 - 90 నేపథ్యంలో ఓ బ్యాంక్ క్యాషియర్ అసాధారణ ప్రయాణం నేపథ్యంలో దీనిని రూపొందించారు. దీపావళి కానుకగా ఇది విడుదల కానుంది. దీనితోపాటు ఆయన ‘మ్యాడ్ 2’, ‘మ్యాజిక్’, విజయ్ దేవరకొండ - గౌతమ్ తిన్ననూరి ప్రాజెక్టులు నిర్మిస్తున్నారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

# జీవితంలో చేసిన తప్పు అదే

## .. ఇప్పటికీ బాధపడుతుంటా: రాహుల్ సిప్లిగంజ్

తనకు రజనీకాంత్ అంటే ఇష్టమని తెలుగు గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ తెలిపారు. ‘అన్నాత్తే’ సినిమాకు సంబంధించిన తాను చేసిన ఓ పని వల్ల ఇప్పటికీ బాధపడుతుంటానని అన్నారు.



‘నాటునాటు’తో ఆస్కార్ స్టేజ్పై ప్రదర్శన ఇచ్చి.. ఎంతోమంది అభిమానాన్ని చూరగొన్న తెలుగు గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ తాజాగా ఆయన ఓ యూట్యూబ్ ఛానల్కు ఇంటర్వ్యూ ఇచ్చారు. అందులో పలు విశేషాలు పంచుకున్నారు. ముఖ్యంగా రజనీకాంత్తో దిగిన ఓ ఫొటో వైరల్ గా మారడంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. జీవితంలో తాను చేసిన తప్పు అదేనని.. అందుకు ఎంతో బాధపడుతున్నానని చెప్పారు.”రంగమార్తాండ సినిమా షూట్ వల్ల ప్రకాశ్ రాజ్, రమ్యకృష్ణతో నాకు అనుబంధం ఏర్పడింది. ఆ సినిమా షూట్లో ఉన్నప్పుడు.. నేను రజనీకాంత్కు వీరాభిమానిని అని ప్రకాశ్‌రాజ్కు తెలిసింది. దాంతో ఆయన నన్ను పిలిచి.. రేపు తాను రజనీకాంత్ సినిమా షూట్కు వెళ్తున్నట్లు చెప్పారు. నన్ను కూడా రమ్మన్నారు. అలా, ‘అన్నాత్తే’ షూట్కు వెళ్లా. రజనీ సర్కు నన్ను పరిచయం చేశారు. వెంటనే కాళ్లకు నమస్కారం చేశా. అయితే అప్పుడు ఆయన మూవీ కాస్ట్యూమ్స్ (సినిమాలో కనిపించే లుక్)తో ఉన్నారు. నా ఇష్టాన్ని గమనించి ఫొటో దిగారు. సినిమాకు సంబంధించి తన లుక్ ఇంకా రిలీజ్ చేయలేదని.. కాబట్టి, సినిమా రిలీజ్ అయ్యే వరకూ ఆ ఫొటో ఎక్కడా షేర్ చేయొద్దని చెప్పారు. దాదాపు 10 రోజులు గడిచిపోయాయి. ఆనందం తట్టుకోలేక ఒకరోజు దాన్ని సోషల్మీడియాలో అప్లోడ్ చేశా. అది కాస్తా నెట్టింట వైరల్ గా మారింది. హీరో లుక్ బయటకు రావడంతో నిర్మాణ సంస్థ కంగారు పడింది. నాకు తెలిసి జీవితంలో నేను చేసిన పెద్ద తప్పు అదే. ఒక అభిమానిగా ఇప్పటికీ బాధపడుతుంటా. ఆ తర్వాత దానిని డిలీట్ కూడా చేసేశా” అని రాహుల్ సిప్లిగంజ్ తెలిపారు. కథానాయికల్లో దీపికా పదుకొణె అంటే తనకు ఎంతో ఇష్టమని చెప్పారు. ‘ఆస్కార్ వేదిక మీద ఆమె తమని పరిచయం చేసినప్పుడు.. తాను ఎంతో ఆనందించానని అన్నారు.

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1864 : తెలుగు, సంస్కృత, ప్రాకృత, ఆంగ్ల భాషా పండితుడు ఆచంట సాంఖ్యాయన శర్మ జననం. (మ.1933).
- 1910 : భారతీయ సంతతికి చెందిన అమెరికన్ ఖగోళ భౌతిక శాస్త్రవేత్త సుబ్రహ్మణ్య చంద్రశేఖర్ జననం. (మ.1995).
- 1917 : భారతీయ గణిత శాస్త్రవేత్త ఎస్.ఎస్.శ్రీఖండే జననం. (మ. 2020)
- 1929 : గాంధేయవాది నిర్మలా దేశ్ పాండే జననం (మ.2008). (చిత్రంలో)
- 1952 : ప్రత్యేకాంధ్ర రాష్ట్రాన్ని కోరుతూ పొట్టి శ్రీరాములు తన ఆమరణ నిరాహారదీక్ష మొదలుపెట్టాడు.
- 1986 : ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర 8వ ముఖ్యమంత్రి టంగుటూరి అంజయ్య మరణం (జ.1919).
- 1987 : పత్రికాసంపాదకుడు, కవి విద్వాన్ విశ్వం మరణం (జ.1915).
- 2003 : మదర్ థెరీసా కు పోప్‌జాన్‌పాల్-2 దైవత్వం (బీటిఫికేషన్) ఆపాదించిన రోజు.
- 2006 : భారతీయ చలనచిత్ర నటి శ్రీవిద్య (నటి) మరణం (జ.1953).
- 2013 : సీపీఎం అగ్ర నేత. పౌరహక్కుల ఉద్యమ నేత. ప్రజా వైద్యుడు యలమంచిలి రాధాకృష్ణమూర్తి మరణం. (జ.1928)


ఆచంట సాంఖ్యాయన శర్మ


సుబ్రహ్మణ్య చంద్రశేఖర్


నిర్మలా దేశ్ పాండే


పొట్టి శ్రీరాములు


టంగుటూరి అంజయ్య


విద్వాన్ విశ్వం


మదర్ థెరీసా


శ్రీవిద్య


రాధాకృష్ణమూర్తి

రిపబ్లిక్ స్పోర్ట్స్ SPORTS

# కివీస్ తో టెస్టు.. సర్ఫరాజ్ ఖాన్ తొలి సెంచరీ

**కివీస్ తో తొలి టెస్టులో భారత్ రెండో ఇన్నింగ్స్లో దూకుడు కొనసాగిస్తోంది.**

**ఈ క్రమంలో యువ బ్యాటర్ సర్ఫరాజ్ సెంచరీ సాధించాడు.**

భారత యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ సెంచరీ బాదేశాడు.కివీస్ తో జరుగుతున్న తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్లో కేవలం 110 బంతుల్లోనే ఈ మార్క్ ను తాకాడు. ఇది అతడి కెరీర్లో తొలి అంతర్జాతీయ సెంచరీ. నాలుగో టెస్టులోనే శతకం పూర్తిచేయడం విశేషం. ఓవర్నైట్ 70 పరుగులతో నాలుగో రోజు ఆటను ప్రారంభించిన సర్ఫరాజ్ఏదశలోనూ తడబాటుకు గురికాలేదు. చూడచక్కని షాట్లతో అలరించాడు. ఆఫ్సైడ్ లేట్ కట్టర్లతో బౌండరీలు రాబట్టాడు. రిషబ్ పంత్తో కలిసి ఇన్నింగ్స్ను ముందుకు నడిపిస్తున్నాడు. కివీస్ తొలి ఇన్నింగ్స్ 402 పరుగులు చేయగా.. భారత్ 46 రన్స్కే ఆలౌటైన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో 356 పరుగులు వెనుకబడి రెండో ఇన్నింగ్స్ను ప్రారంభించిన భారత్కు ఓపెనర్లు మంచిఆరంభం ఇచ్చారు. ఆ తర్వాత విరాట్ కోహ్లి (70)తో కలిసి సర్ఫరాజ్ ఖాన్ దూకుడుగా ఆడాడు.కివీస్ పేస్,





స్పిన్ను దీటుగా ఎదుర్కొంటూ సెంచరీ సాధించాడు. రెండో ఇన్నింగ్స్ ఆడటం తీవ్రఒత్తిడితో కూడుకున్నదే. అయినాసరే ఎలాంటి ఇబ్బంది లేకుండా సర్ఫరాజ్ పరుగులు రాబట్టడంవిశేషం.రెండో రోజు వికెట్ కీపింగ్ చేస్తుండగా.. మోకాలిపై నేరుగా బంతి పడటంతో నొప్పితో మైదానం వీడిన రిషభ్ పంత్ మూడో రోజు కీపింగ్ చేయలేదు. కీలకమైన రెండో ఇన్నింగ్స్లో బ్యాటింగ్కు వస్తాడా? లేదా? అనేది సందిగ్ధత నెలకొంది. కానీ, నిన్న మ్యాచ్ ముగిసిన తర్వాత ప్రాక్టీస్ చేస్తున్నట్లుగా కనిపించాడు. దీంతో నాలుగో రోజు సర్ఫరాజ్తో కలిసి క్రీజ్లోకి పంత్ రావడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. వీరిద్దరూ ఇప్పటికే హాఫ్ సెంచరీ భాగస్వామ్యం నిర్మించారు. అయితే, ఇన్నింగ్స్ 56వ ఓవర్ లో రనౌట్ అయ్యే ప్రమాదం నుంచి పంత్ బయటపడ్డాడు. రెండో పరుగు కోసం వస్తున్న పంత్ను వద్దని వారించే క్రమంలో సర్ఫరాజ్ పడిన పాట్లు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి.


# లైఫ్ స్టైల్

## ఈ చిన్న పనులతో పిల్లలకు క్రమశిక్షణ నేర్పించండి.. రూపాయి కూడా ఖర్చు పెట్టక్కర్లేదు.

ప్రస్తుతం పిల్లల్ని పెంచడం తల్లిదండ్రులకు పెద్ద సవాల్‌గా మారింది. బిజీ లైఫ్ స్టైల్ కారణంగా పిల్లల్ని పెంచడం, వారికి గైడెన్స్ ఇవ్వడంలో అశ్రద్ధ చూపుతున్నారు. పిల్లలకు క్రమశిక్షణ చాలా ముఖ్యం. పిల్లలు ఇది కేవలం వారి తల్లిదండ్రుల నుంచి మాత్రమే నేర్చుకోగలరు. చిన్న చిన్న విషయాలపై ఓపికతో శ్రద్ధ పెడితే పిల్లలు భవిష్యత్తుపై పెద్ద ప్రభావం చూపుతుంది. మీరు చేసే చిన్న పనులే పిల్లల్లో ప్రణాళిక, సహనం, సమయ పాలన వంటి లక్షణాల్ని అభివృద్ధి చేస్తాయి. అలాగే తల్లిదండ్రుల మంచి ప్రవర్తన పిల్లల్లో స్వీయ క్రమశిక్షణను ప్రోత్సహిస్తుంది. చిన్నతనం నుంచే క్రమశిక్షణ నేర్పడం చాలా ముఖ్యమైన విషయం.ఇది పిల్లల్లో స్వాతంత్ర్యం, బాధ్యత, గౌరవాన్ని పెంచుతుంది. పిల్లల్లో క్రమశిక్షణ పెంచడానికి చాలా మంది తల్లిదండ్రులు స్ట్రిక్ట్‌గా, సీరియస్‌గా ఉంటారు. ఇలా చేయడం ఎంత మాత్రం మంచిది కాదు. పిల్లల మానసిక ప్రవర్తనపై ఇది తీవ్ర ప్రభావం చూపిస్తుంది. అందుకే పిల్లల్లో చిన్నప్పటి నుంచే క్రమశిక్షణ తీసుకురావడానికి వారికి చిన్న చిన్న పనులు నేర్పండి. ఈ చిన్న పనులే వారిలో క్రమశిక్షణ వచ్చేలా చేస్తాయి. ఆ పనులేంటో ఇక్కడ తెలుసుకుందాం.







### స్కూల్ బ్యాగ్ ప్యాకింగ్..



చాలా మంది తల్లిదండ్రులు పిల్లల స్కూల్ బ్యాగులను సర్దుతుంటారు. అయితే, ఇలా ఏ మాత్రం చేయకండి. పిల్లలు తమ స్కూల్ బ్యాగులను తామే సర్దుకునేలా చేయడం వల్ల వారిలో బాధ్యత భావం పెరుగుతుంది. ఇది ప్రణాళిక యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడానికి వారికి సహాయపడుతుంది. వారి బ్యాగ్ వారే సర్దుకోవడం వల్ల పిల్లలు నాయకత్వం వహించడం నేర్చుకుంటారు. కానీ తల్లిదండ్రులు ప్రారంభంలో వారికి సహాయం చేయడానికి చెక్‌లిస్ట్‌ను అందించాల్సి ఉంటుంది. ఈ చిన్న రొటీన్ పని పిల్లల ఎదుగుదలలో ఎంతో సహాయపడుతుంది. వారిలో స్వాతంత్ర భావాల్ని ప్రోత్సహిస్తుంది.

### రాత్రి భోజనం తర్వాత టేబుల్ క్లీన్ చేయించడం..



రాత్రి భోజనం తర్వాత టేబుల్ శుభ్రం చేయమని పిల్లలను అడగండి. ఇంటి పనులలో సహాయం చేసినప్పుడు.. వారు సహకారం, ఇతరులతో ఎలా కలిసి పనిచేయాలో తెలుసుకుంటారు. దీనివల్ల పిల్లల్లో పర్యావరణం పట్ల బాధ్యతా భావం ఏర్పడుతుంది. బయట చెత్త చెదారం వేయడానికి వెనుకాడతారు. నీట్‌గా ఎలా ఉండాలో, బయట ఎలా ప్రవర్తించాలో తెలుసుకుంటారు. ఈ చిన్న పనితో వారు ఇంట్లో వస్తువులను శుభ్రంగా, పద్ధతి ప్రకారం ఉంచడం.. ప్రతి ఒక్కరి బాధ్యత అని అర్థం చేసుకుంటారు. పిల్లలకు క్రమం తప్పకుండా పనులను అప్పగించండి. దీంతో వారు మరింత బాధ్యతగా మెలుగుతారు

### బట్టలు సర్దడం..

ఈ పని పిల్లలకు సహనం, శ్రద్ధను వివరంగా నేర్పుతుంది. పిల్లల దుస్తులను వారే సర్దుకోవడం నేర్చుకోవాలి. దీంతో.. పిల్లలు తమ వస్తువుల్ని బాగా చూసుకునే అవకాశం ఉంటుంది. ఇది పిల్లలకు పనులను పూర్తి చేయగల సామర్థ్యాన్ని ఇస్తుంది. అంతేకాకుండా బట్టలు ఎక్కడ పడితే అక్కడ పడేసే చెడు అలవాటు మానుకుంటారు.




### బొమ్మల నిర్వహణ..



వారి బొమ్మలను ఎలా జాగ్రత్తగా ఉంచుకోవాలో పిల్లలకు నేర్పండి. ఇంట్లో ఆడుకోవడం అయిపోయిన తర్వాత వారి బొమ్మలను సరైన స్థలంలో ఉంచేలా చేయండి. దీంతో పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకుంటారు. ఆట స్థలాన్ని శుభ్రంగా ఉంచుకునే బాధ్యత తీసుకోవడం ద్వారా, పిల్లలు నియంత్రణ నేర్చుకుంటారు. బంధువుల ఇంటికి వెళ్లినప్పుడు కూడా ఇదే ఫాలో అవుతారు. ఈ చిన్న పని పిల్లలను మరింత క్రమశిక్షణగా చేస్తుంది. వారికి నైపుణ్యాలను నేర్పుతుంది. ఇది భవిష్యత్తులో వారికి ఉపయోగపడుతుంది.

### నిద్ర సమయం..



పిల్లలు రోజూ ఒకే సమయానికి నిద్రపోయేలా టైం టేబుల్ ఏర్పాటు చేయండి. దీంతో వాళ్లు సెల్ఫ్ కంట్రోల్, స్థిరత్వంపై పట్టు సాధిస్తారు. . పళ్ళు తోముకోవడం లేదా పుస్తకం చదవడం వంటి కొన్ని పనులు పడుకునే ముందు పూర్తి చేయాలని వారికి నేర్పండి. రోజూ ఒకే టైమ్‌కి నిద్రపోతే ఆరోగ్యానికి ఎంతో మంచిదని వారికి వివరించండి. ఇలా.. చేయడం వల్ల భవిష్యత్తులో కూడా ఇదే ఫాలో అవుతారు. ఇది వారి కెరీర్ అభివృద్ధికి ఎంతో సహాయపడుతుంది. ఇలా చిన్న చిన్న పనుల ద్వారా వారిలో క్రమశిక్షణ మెరుగుపడేలా చేయొచ్చని నిపుణులు చెబుతున్నారు.

గమనిక..ఇది సోషల్ సమాచారం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, సంబంధిత నిపుణుల ప్రకారం ఈ వివరాలు అందించాం. వ్యక్తుల ప్రవర్తనను బట్టి ఫలితాలుంటాయి. వీటిని పాటించేముందు.. సంబంధిత నిపుణుడిని సంప్రదించడం శ్రేయస్కరం.